క్లుప్తంగా

దరఖాస్తులు స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్లో ఖాళీగా ఉన్న పీజీటీ (బోటనీ)పోస్టు భర్తీకి గంటల ప్రాతిపదికన (హావర్లీ బేస్డ్ టీచర్)పనిచేయుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుచ్చన్న తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉండి, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 19లోపు జిరాక్స్ కాపీలతో అప్లై చేసుకోవాలన్నారు. 20న మోడల్‌స్కూల్లో డెమో ఉంటుందని, పూర్తి సమాచారం కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

సంక్షేమ పథకాల అమలు కోసం...

చెన్నూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.500 గ్యాస్, జీరో కరెంటు బిల్లుల అమలు కోసం ఈ నెల 18న సాయంత్రం 5గంటల వరకు ప్రజాపాలన దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేసిన దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. కరెంటు జీరో బిల్లులు, గ్యాస్ డబ్బులు రాని లబ్ధిదారులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమారం: రాష్ట్ర మంత్రివర్గంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామికి చోటు కల్పించినందుకు స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చిత్రపటాలకు నాయకులు కొక్కుల నరేష్, శ్యాంసుందర్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. నాయకులు బూనేని సుధాకర్, బానోత్ విజయ్, వేల్పుల శ్రీనివాస్, జనగామ తిరుపతి పాల్గొన్నారు.

అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంజయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గతేడాది మాదిరిగానే ఈసారి కూడా అత్యధిక అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కె.అంజయ్య అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అడ్మిషన్‌ల కోసం ముద్రించిన కరపత్రాలను, వాల్ స్టిక్కర్స్‌ను లెక్చరర్స్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది బాలుర జూనియర్ కళాశాలలో జిల్లాలోనే అత్యధికంగా అడ్మిషన్లు జరిగాయని తెలిపారు. ఈ సారి కూడా అదే ఒరవడిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ మండల ఐదో మహాసభ

కాసిపేట: మండలంలోని సోమగూడెం కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సీపీఐ ఐదో మహాసభ పార్టీ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో మంచిర్యాలలో జరిగే బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరారు. అనంతరం 21మంది కౌన్సిల్ సభ్యులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులతో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా దాగం మల్లేశ్, సహాయ కార్యదర్శులుగా సర్వేశం, దుర్గం సుధాకర్, కోశాధికారిగా పులి శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు గట్టయ్య, హన్మంతు, రాజ్‌కుమార్, లింగమూర్తి, కోవ లింగు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం పోరాడుతాం'

భీమారం: తమపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా, ప్రజల కోసం పోరాడుతామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు పోరాటం ఆపేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి మధునయ్య, పవన్, సాగర్, మణిదీప్, రాజలింగు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా రక్తదాన శిబిరంతో పాటు, మధ్యాహ్నం 12గంటలకు మెప్మా మహిళా సంఘాలతో తయారు చేయబడిన వివిధ రకాల వస్తువులు, పిండి వంటలు తయారు చేసినవి అమ్మకానికి ఉంచనున్నట్లు తెలిపారు.

బురద తొలగింది.. బాధ తీరింది

సాక్షి ఎఫెక్ట్..



కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామం ఎస్సీ కాలనీలో 'రోడ్డుపై బురద–ప్రజల వ్యథ' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై కథనం ప్రచురితం కాగా ఎంపీవో అక్తర్ స్పందించారు. పంచాయతీ కార్యదర్శి మధుకర్‌కు ఆదేశాలు జారీ చేయడంతో రోడ్డుపై బురదను తొలగించి చదును చేయించారు. కాలనీవాసులు 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలిపారు.



కొత్త స్తంభం వేశారు

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్–దండేపల్లి గ్రా మాల శివారు మధ్య జిడ్డిగి శంకరయ్య అనే రైతు పొలంలో 25రోజుల క్రితం గాలివానకు విద్యుత్ స్తంభం విరిగిపడింది. వైర్లు పొలంలో తెగిపడ్డాయి. విరి గిన స్తంభం స్థానంలో కొత్తది వేయాలని అడిగితే విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. ఈ దుస్థితిపై 'గాలివానకు నేలకొరిగిన స్తంభం' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం అయ్యింది. కాగా విద్యుత్ అధికారులు స్పందించి విరిగిన స్తంభం స్థా నంలో కొత్తస్తంభం వేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి రైతు కృతజ్ఞతలు తెలిపారు.

శిథిల భవనం.. వసతి అధ్వానం

- ప్రమాదకరంగా జైపూర్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ భవనం
- తాత్కాలిక భవనంలోకి మార్చడానికి ప్రయత్నాలు
- పక్కా భవనం నిర్మించాలని విద్యార్థుల డిమాండ్



ప్రమాదకరంగా మారిన వసతి గృహ భవనం

జైపూర్: దశాబ్దాల కిందట నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల వసతికి ఆటంకం ఏర్పడింది. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ జైపూర్ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులకు మాత్రం ఈ ఏడాది కూడా కష్టాలు తప్పేలా లేవు. కొత్త భవనం నిర్మిస్తారని ఆశించిన విద్యార్థులకు మళ్లీ నిరాశే మిగిలింది.

తూర్పు జిల్లాలో పెద్దది..

జైపూర్ మండల కేంద్రంలో 1995లో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నిర్మించారు. తూర్పు జిల్లాల్లో ఇదే పెద్ద వసతి గృహం కావడం.. అనేక మంది విద్యార్థులు వసతి గృహంలో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. కాలక్రమేనా భవనం శిథిలం కావడం.. పలు దఫాలుగా అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి మరమ్మతు చేశారు. కానీ ప్రస్తుతం ఆ భవనం తలుపులు తడితే ఊడిపోయేలా.. కిటికీ ముట్టుకుంటే పడిపోయేలా, గోడలు, స్లాబ్ పెచ్చులు ఊడిపోయి, భవనం గచ్చు పాడైపోయి ప్రమాదకరంగా మారింది. ఈ ఏడాది వసతి గృహంలో నిర్వహణ కష్టంగా మారడంతో తాత్కాలిక భవనంలోకి మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎస్సీ వసతి గృహాలపై నిర్లక్ష్యం....

భవనం శిథిలమై ఏళ్లు గడుస్తున్నప్పటికీ కొత్త భవనంపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. భవనాలను ఆధునీకరించి వసతులు కల్పించాల్సి ఉండగా, ఉన్న వసతి కూడా సక్రమంగా కల్పించకపోవడంతో నిరుపేద విద్యార్థులకు ఇబ్బందికరంగా మారుతోంది. కనీసం ఇప్పటికైనా పాలకులు స్పందించి పక్కా భవనం నిర్మించాలని కోరుతున్నారు.

మరో చోటకు తరలింపు...

వసతి గృహాన్ని ఈ ఏడాది స్థానిక సాగరావు క్లాంప్లెక్స్‌లో తాత్కాలిక భవనంలోకి తరలించనున్నారు. భవనం ప్రమాదకరంగా మారడంతో విద్యార్థుల సౌకర్యార్థం తాత్కాలిక భవనంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పక్కా భవనం నిర్మించాలి..



దళిత విద్యార్థులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూడటం సరికాదు. చాలా సార్లు ఎస్సీ బాలుర వసతి గృహ భవనం నిర్మించాలని విన్నవించాం. ఇప్పటికైనా పాలకులు స్పందించి, పక్కా వసతి గృహభవనం నిర్మించి విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించాలి.

– ఇరిగిరాల మల్లేశ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి

నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, కొంత సమయం కేటాయించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ శాఖ వైద్యాధికారి డా.పద్మజ, వైద్యాధికారులు డా. మేఘన, ప్రోగాం అధికారి కృపాబాయి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాక విగ్రహం ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్: ఇందారం చౌరస్తా వద్ద కేంద్ర మాజీ మంత్రి, కాక వెంకటస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ తోకల సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన అభిమానులు కలెక్టర్ కుమార్ దీపక్‌ను కోరారు. ఆ చౌరస్తాకు కాక చౌక్‌గా నామకరణం చేయాలన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

లక్సెట్టిపేట: హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న న్యాయవాది నారాయణను కిడ్నాప్ చేసి, మరొక న్యాయవాది శైలేష్‌పై దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సత్తన్న, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

భూ బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గర్మిళ్ల శివారు తిలక్‌నగర్‌లో సర్వే నంబర్ 290లోని 1.25ఎకరాల స్థలాన్ని ముదాం శ్రీనివాస్ మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దానిని వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం బాధితులు మంచిర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. భూమిని సర్వే చేసి, దాని ఆధారంగా తమకు న్యాయం చేయాలని కోరారు.

డబ్బులు చెల్లించాలని నిరసన

పాతమంచిర్యాల: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2018, 2019సంవత్సరంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కల సంరక్షణ కోసం మహిళా సంఘాల సభ్యులకు చెల్లించాల్సిన డబ్బును చెల్లించాలని మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. డబ్బుల చెల్లింపుల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి, మహిళా సంఘాల సభ్యులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు దాసరి రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, అనిత, లక్ష్మి, కేతా, రమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ పాల్గొన్నారు.


అటవీశాఖ అధికారుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న అటవీశాఖ అధికారులు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి అటవీ రేంజ్ సిబ్బంది సోమవారం శ్రమదానం చేసి పరిసరాలు పరిశుభ్రం చేశారు. రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్, చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు హన్మంతరావు, రవి, బీట్ అధికారులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



పాపతో 108 సిబ్బంది

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి గ్రామానికి చెందిన గురుండ్ల వసమతి నిండుగర్భిణీకి 108అంబులెన్స్ సిబ్బంది పురుడు పోశారు. తెల్లవారుజామున ఆమె నొప్పులతో బాధపడుతూ అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఈఎంటీ జనార్దన్‌రెడ్డి, పైలెట్ హిమామ్ షరీఫ్ గ్రామానికి వెళ్లి గర్భిణీని చెన్నూర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే కోటపల్లి మండలం సర్వాయిపేట అటవీ ప్రాంతంలో నొప్పులు ఎక్కువయ్యాయి. 108రాష్ట్ర ప్రధాన కార్యాలయ వైద్యులను ఫోన్‌లో సంప్రదిస్తూ, ఈఎంటీ జనార్దన్ వైద్యం అందించి సుఖ ప్రసవం చేయించారు. ఆడ పాపకు జన్మనిచ్చింది. మెరుగైన వైద్యం కోసం తల్లి, బిడ్డను చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'రైతునేస్తం' వీక్షించిన రైతులు




దండేపల్లి: గూడెంలో పాల్గొన్న కోట్నాక తిరుపతి

దండేపల్లి/జైపూర్/నెన్నెల/భీమారం/నస్పూర్/భీమిని/కాసిపేట/చెన్నూర్‌రూరల్/వేమనపల్లి: రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని 1,031 రైతు వేదికల్లో 'రైతునేస్తం' కార్యక్రమ నిర్వహణ కోసం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా దండేపల్లి, జైపూర్, నెన్నెల, భీమారం, నస్పూర్, భీమిని, కాసిపేట, చెన్నూర్, వేమనపల్లి మండలాల పరిధిలోని పలు రైతువేదికల్లో రైతులు, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ వీక్షించారు. రైతుభరోసా, రైతు నేస్తం పథకాలతో కర్షకులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతీ మంగళవారం ఆన్‌లైన్‌లో ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారని అధికారులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో దండేపల్లిలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, జైపూర్‌లో ఆర్డీవో శ్రీనివాస్‌రావు, నస్పూర్‌లో జిల్లా ఉద్యాన పట్టుశాఖ అధికారి అనిత, సాంకేతిక వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఉద్యాశాఖ అధికారి తిరుపతి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ శివభక్త మార్కండేయ ఆలయాన్ని మండలం లోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ వర్గానికి చెంది ఉపారపు నర్సయ్య ఇటీవల దర్శించుకున్నాడు. అతడిని ఆలయంలోకి ఎందుకు రానిచ్చావని ఆలయ పూజారీ వెంకటేశ్వర్లుపై దండేపల్లి పద్మశాలి సంఘం నాయకుడు ప్రశ్నించారు. దళితుడి ఆలయ ప్రవేశంపై అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు దండేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు అంజన్న, బాపన్న, నరేష్, సత్యం, నవీన్ పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌కు వినతి



పాతమంచిర్యాల: జిల్లాలోని కోటపల్లి మండలం లక్ష్మీపూర్ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్‌లు నిలుపాలని సీపీఎం నాయకులు సోమవారం మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. డీఎం సానుకూలంగా స్పందించి బస్‌లు నిలిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బోడంకి చందు, సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు దుంపల రంజిత్, పాల్గొన్నారు.

సింగరేణి అధికారులకు పీఆర్‌పీ చెల్లించాలి




శ్రీరాంపూర్: వినతిపత్రం ఇస్తున్న సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

శ్రీరాంపూర్: ప్రతీ సంవత్సరం చెల్లించే పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే(పీఆర్‌పీ)ని వెంటనే చెల్లించాలని సింగరేణి అధికారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రతినిధులు శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాసులును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 23లోగా డిమాండ్లు పరిష్కరించకుంటే 24న నల్ల బ్యాడ్జీలతో నిరసన, జూలై 1న రిలే నిరాహార దీక్ష, జూలై 7న వర్క్ టూ రూల్ పాటిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అపెక్స్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు మహేశ్, జాయింట్ సెక్రెటరీ భీమన్న, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీవైసీఓంఎం రమేశ్ బాబు, డీజీఎం(ఐఈడీ) రాజన్నతో పాటు అన్ని గనుల మేనేజర్లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సీఎంఓఏ మందమర్రి ఏరియా అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో ఏరియా జీఎం దేవేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నాగవర్ధన్, ఆర్.నరేశ్, జాయింట్ సెక్రెటరీ రవి, సంతోష్ సంఘం నాయకులు, ఏరియా అధికారులు పాల్గొన్నారు.

జైపూర్: జైపూర్ మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సింగరేణి అధికారుల సంఘం(సీఎంఓఏ) బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ బలరాంకు అధికారుల సమస్యలపై పర్సనల్ అధికారి కిరణ్‌బాబు ద్వారా వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

కార్మికులకు యోగా శిక్షణ తరగతులు



ఉద్యోగులతో యోగా చేస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని కార్మికులకు యోగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాసనాలు ప్రదర్శించడంతో పాటు నిత్యజీవితంలో ఉపయోగపడేలా శిక్షకుల ద్వారా వారం రోజుల నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా శిక్షకుడు, డెప్యూటీ సూపరింటెండెంట్ కారంపూడి శ్రీనివాసరాజు కార్మికులకు ప్రత్యేక శ్రద్ధతో యోగాసనాలు నేర్పిస్తున్నారు. కార్మికులు, ఉద్యోగులు ఎంతో శ్రద్ధతో యోగా అభ్యసిస్తున్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఏఐటీయూసీ గని ఫిట్ సెక్రెటరి తిరుపతి గౌడ్, ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఇన్‌చార్జీ డీజీఎం రాజేశ్వర్, అధికారులు శ్రీధర్, అమర్నాథ్ రెడ్డి, హనుమాన్ గౌడ్, దేవేందర్ రెడ్డి, కాంతారావు పాల్గొన్నారు. మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో ఏరియా జీఎం దేవేందర్ సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఏరియా ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, డీజీఎం(సివిల్) రాము ఐఈడీ కిరణ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మునీర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: సింగరేణి ప్రాంతంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ పాత్రికేయులు మునీర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సోమవారం హైదరాబాద్‌లో సీఎండీ బలరాంకు రెవల్యూషన్ యూత్ సొసైటీ అధ్యక్షుడు అనీల్‌భగ త్, ఉపాధ్యక్షుడు అక్బర్ వినతిపత్రం అందించారు.

■ బొగ్గుబాయి వార్తలు

డైరెక్టర్ (పా) ను కలిసిన ఏఐటీయూసీ నేతలు



డైరెక్టర్‌తో ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి నూతన డైరెక్టర్ (పా)గా నియమితులైన గౌతం పొట్రూ(ఐఏఎస్)ను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సోమవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, పారిశ్రామిక సంబంధాల పెంపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు సారయ్య, కే. వీరభద్రయ్య, వైవీ రావు, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ నాయకులు బాజీసైదా, వెంకట్, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ అధికారులకు సన్మానం



డీజీఎంను సన్మానిస్తున్న బీసీ సంఘం ఉద్యోగులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పలు డిపార్టుమెంట్లలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన బీసీ అధికారులు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఐఈడీ విభాగం డీజీఎం రాజన్నను సింగరేణి బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సహకరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

18న క్రీడా పాఠశాలలకు ఎంపిక పోటీలు

చెన్నూర్/భీమారం/జైపూర్/మందమర్రిరూరల్/వేమనపల్లి/దండేపల్లి/వేమనపల్లి/జన్నారం/తాండూర్: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడాపాఠశాలల్లో 2025- 26 సంవత్సరానికి ప్రవేశాల కోసం ఈ నెల 18న మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు కొమ్మెర రాధాకృష్ణమూర్తి, గోపాల్‌రావు, బి.శ్రీనివాస్, దత్తుమూర్తి, చిన్నయ్య, శ్రీధర్‌రెడ్డి, ఎస్.విజయ్ కుమార్, మల్లేశం, వ్యాయామ ఉపాధ్యాయులు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాల, జైపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మందమర్రి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, వేమనపల్లి జెడ్పీ పాఠశాలలో, తాండూర్ మండలం తంగళ్లపల్లి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో, జన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 1- 09- 2016 నుంచి 31- 09- 2017 మధ్య జన్మించిన జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని, ప్రింట్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు.

'ఆపరేషన్ కగార్' ఆపాలి

బెల్లంపల్లి: ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న హత్యాకాండను ఆపాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్క్ వద్ద జరగనున్న ధర్నా పోస్టర్లను సోమవారం బెల్లంపల్లిలో ఆవిష్కరించారు.